www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 51 | 04-10-2021 | పుటలు : 4

## డిసెంబర్ నాటికి నాక్ గుర్తింపు తెచ్చే విధంగా కృషిచేస్తున్నాం



మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**30.09.21 (మీడియాసెల్)** అదికవి నన్నయ విశ్వ విద్యాలయానికి ఈ ఏడాది డిసెంబర్ నాటికి నాక్ గుర్తింపు తెచ్చే విధంగా కృషిచేస్తున్నామని అనూర్ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు వెల్లడించారు. ఇప్పటికే క్యాంపసను ఫ్రీ ర్యాగింగ్ క్యాంపస్ గా తీర్చిదిద్దామని, విద్యార్థినీ, విద్యార్థులు మంచి వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా యూనివర్సిటీని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో జగన్నాథరావు మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకం ద్వారా రూ 8.30 కోట్ల నిధులు యూనివర్సిటికీ వచ్చాయని వాటితో ఒక మల్టీవర్సస్ స్టేడియంతో పాటు స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేయడానికి నిర్ణయించామన్నారు. అనూర్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇప్పటికే ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపు వచ్చేలా చేయడం వల్ల విద్యార్థులు మంచి ఉపాధి అవకాశాలు పొందేందుకు వీలైందన్నారు. అదే తరహాలో న్యాక్ గుర్తింపుతో పాటు మంచి గ్రేడ్ వచ్చేలా చేస్తే యుజిసి ద్వారా అధిక మొత్తంలో నిధులు సాధించేందుకు ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు నమ్మకంతో నన్నయ యూనివర్సిటికీ విసిగా నియమించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టేలా మంచి ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని తెలిపారు. దిశ యాప్ ఆవిష్కరణ కూడా నన్నయలో ఘనంగా జరిగిందని దీనికి రాష్ట్ర మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు విచ్చేశారన్నారు. కరోనా లాక్డౌన్ సమయంలో కూడా ఫ్యాకల్టీ, విద్యార్థులను సమన్వయం చేసుకుని వెబినార్లు నిర్వహించామన్నారు. గతంలో యూనివర్సిటీని పరిపాలించిన అధికారులు ఐ.ఎస్.ఓ, న్యాక్ వంటి గుర్తింపు సాధించడానికి ఎందుకు ప్రయత్నం చేయలేదో తెలియదని తాము మాత్రం ఈ విషయంలో పట్టుదలగా ఉన్నామని అన్ని గుర్తింపులు సాధించి యూనివర్సిటిని ప్రగతి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు అధ్యాపకులు ఒక గైడ్, కౌన్సిలర్ గా ఉండాలే తప్ప ఏదో వచ్చి పాఠాలు బోధించి వెళ్లిపోయామనే విధానాన్ని విడనాడాలన్నారు. అధ్యాపక వృత్తిపై ఇష్టంతోనే తాను ఈ ప్రొఫెషన్లోకి వచ్చానని ఇప్పటికీ క్లాస్ రూమ్లో పాఠాలు బోధించడానికే ఇష్టపడతానని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. 8 నుంచి 9 రీసెర్చ్ ప్రాజెక్ట్స్ చేయడం ద్వారా నిధులు రాబట్టడానికి ప్రయత్నిస్తున్నామని, 1.5 కోట్ల నిధులను ఓ.ఎన్.జి.సి. నుంచి సాధించామన్నారు. తమ యూనివర్సిటీలో విద్యార్థులందరూ దిశ యాప్ డౌన్ లోడ్ చేసుకునేలా చేశామని, ర్యాగింగ్ పూర్తిగా నిషేధించామని తెలిపారు. ప్రతి అధ్యాపకుడు ఖచ్చితంగా రీసెర్చ్ పేపర్లు పబ్లికేషన్ చేసేలా చేశామన్నారు. గ్రీన్ క్యాంపస్ గా మార్చడానికి వేల మొక్కలు నాటామని, అటవీ శాఖ సహకారంతో ఏడెకరాల స్థలంలో బయో డైవర్సిటీ పార్క్ ని కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కళాశాల హాస్టళ్లలో ఫ్రీ వై ఫై సౌకర్యం కల్పించామని, రీడింగ్ రూమ్స్, లైబ్రరీలో ఆన్లైన్ జర్నల్స్ అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో 400 అనుబంధ కళాశాలలు ఉన్నప్పటికీ ప్రస్తుతం 320 మాత్రమే యాక్టివ్ గా ఉన్నాయన్నారు. ఏడాదికి రూ 14 కోట్లు బడ్జెట్ కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది 7 నుంచి 8 కోట్లు మాత్రమే విడుదలయ్యాయన్నారు. పర్మినెంట్ ఫ్యాకల్టీ కొరతను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది సిఎం జగన్ 40 మందిని కేటాయించారని, వచ్చే ఏడాది ఈ సంఖ్యను మరింతగా పెంచితే ఇక ఫ్యాకల్టీ కొరత ఉండదన్నారు. సాఫ్ట్వేర్ టెక్నాలజీ పార్కుతో ఎంఓయు చేసుకున్నామని, స్కిల్ డెవలప్మెంట్ కాలేజీని కూడా ప్రారంభిస్తున్నామన్నారు. మంచి విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పొందేలా ఓ.ఎన్.జి.సి. వంటి సంస్థల సహకారంతో తనకున్న అనుభవంతో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. 512 మంది యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో బ్లడ్ డోనర్ డేటా బేస్ ను ఏర్పాటు చేశామని దాని వల్ల ఎవరికి రక్తం అవసరమైనా తక్షణం అందించేలా సామాజిక బాధ్యతతో పనిచేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేసి హాట్ లైన్ నెంబర్ ఇచ్చామని దాని ద్వారా వారిలో యాంగ్జయిటీ, డిప్రెషన్ను దూరం చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దీనికి ముందు మీట్ ది ప్రెస్ కు విచ్చేసిన విసి మొక్కా జగన్నాథరావును ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మండెల శ్రీరామ్మూర్తి. అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, మాజీ అధ్యక్షులు కృష్ణకుమార్ దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్యఅశోక్, పి.ఆర్.ఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



డిపార్ట్మెంట్ వాల్ జర్నల్ ను ప్రారంభించిన వీసీ



## నన్నయలో వాల్ జర్నల్స్ ప్రారంభించిన వీసీ

**30.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ వాల్ జర్నల్స్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. శుక్రవారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన డిపార్ట్మెంట్ వాల్ జర్నల్స్ ను వీసీ ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు,అధ్యాపకుల సహకారంతో డిపార్టమెంట్ వాల్ జర్నల్స్ ను ప్రారంభించామని, వాల్ జర్నల్స్ తో విద్యార్థులలో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు. ఈ వాల్ జర్నల్స్ లో ప్రధానంగా రిసర్చ్ పేపర్స్, ఆర్టికల్స్,విద్యా విజ్ఞానపరమైన అంశాలు ఉంటాయని చెప్పారు. ప్రతి వాల్ జర్నల్ కు “ట్రెండ్స్ అండ్ టెక్నాలజీ” పేరుతో ప్రత్యేక కాలమ్ ఉంటుందని దానిలో ప్లేస్మెంట్స్,టెక్నాలజీ అప్ డేట్స్,అంతర్జాతీయ విద్యా పరిశోధన అవకాశాలు వంటి అంశాలుంటాయన్నారు. నూతన ఆలోచనలు రచన,వ్యాస సామర్థ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. భాష,సాహిత్యం, విజ్ఞానాలపై పట్టు ఉంటుందని తెలియజేశారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని ఆయా విభాగాలు సంబంధిత పేర్లతో వాల్ జర్నల్స్ ను విడుదల చేస్తారని చెప్పారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ వారు ఆలంబన పేరుతో,డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ వారు సెన్స్ అండ్ సైన్స్ పేరుతో డిపార్టమెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ వారు స్పార్క్ పేరుతో,డిపార్ట్మెంట్ ఆఫ్ సి.ఎస్.ఈ. గేట్ పేరుతో,డిపార్ట్మెంట్ ఆఫ్ ఈ.సి.ఈ ఎలక్ట్రిసిటీ పేరుతో వాల్ జర్నల్స్ ను విడుదల చేస్తారని చెప్పారు. ప్రతి నెల ఆయా విభాగాలు వాల్ జర్నల్స్ ను ఏర్పాటు చేస్తారని 12 నెలల్లో వచ్చిన వాల్ జర్నల్స్ వార్షిక సంచికగా పుస్తక రూపంలో విడుదల అవుతుందన్నారు. డిపార్టమెంట్ వాల్ జర్నల్స్ కు ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ చీఫ్ ఎడిటర్ గా వ్యవహరిస్తారని విభాగాధిపతులు, కోర్సుకోఆర్డినేటర్లు అసోసియేట్ ఎడిటర్లుగా ఉంటారని తెలిపారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకొని సృజనాత్మక విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో వీసీ జగన్నాథరావును సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్,డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, విభాగాధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



## ఓ మహాత్మా..!!

జాతిపిత 'ఫాదర్ ఆఫ్ ది నేషన్' మన బాపూజీ! అసంఖ్యాక భారతీయుల దారిద్ర్య జీవన సంకేతంగా కొల్లాయిగట్టి *'Naked fakir of India'* అని చర్చిల్ చేత వక్కాణింపబడ్డారు. ఎన్నేళ్లు గడిచినా ఆయన అమరజ్యోతి ప్రపంచాన్ని వెలిగిస్తూనే ఉంటుంది. "ఇటువంటి అద్భుతమైన వ్యక్తి ఒకరు రక్తమాంసాలతో ఈ నేలపై నడయాడేరంటే భావితరాలు విస్తుబోతారు" అని ప్రపంచ మేధావులలో అగ్రగణ్యుడైన ఐన్స్టీన్ ఆశ్చర్యం ప్రకటించారు. ఈరోజు మనకి గాంధేయ వివేకం అవసరం. గాంధేయవాదం కాదు. అన్నారు ప్రముఖ రచయిత సాల్మన్ రష్దీ. ప్రజాసేవ, దేశసేవ చేయాలనే ఉత్సాహం నాలో కలిగిందంటే అది గాంధీ రచనలను చదవటం వల్లనే. గాంధీ అంత నిరాడంబరంగా ప్రతి పార్టీ కార్యకర్త జీవితం గడపాలి. అన్నారు కమ్యూనిస్టు అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య గారు. "మానవతరాత్మకు రూప సంకేతం గాంధీజీ" అన్నారు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక క్రీస్తు రుధిర బిందువు, ఒక బుద్ధుని అభయ ముద్ర, ఒక శాంతి మంత్ర పాఠము... ఇవన్నీ కలసి గాంధీగా జన్మించాయంటారు శ్రీ గరికిపాటి. బుద్ధుని అనంతరం సంపూర్ణ మానవ సమాజానికి గొప్ప సందేశం మహా పురుషుడు గాంధీజీ ఒక్కరే అంటారు రాహుల్ సాంకృత్యాయన్.

"ఒక పిచ్చివాని చేతి తూటా తోనే నేను మరణించాల్సి వస్తే నేను చిరునవ్వుతో దానిని స్వీకరించాలి. నాకు కోపం రాకూడదు. నా హృదయం లోని, పెదవుల పైన దేవుడు ఉండాలి. మీరంతా నాకు ఒక మాట ఇవ్వాలి అదే జరిగే పక్షంలో కన్నీరు పెట్టుకోబోమని" మరణించడానికి ముందు రోజుల్లో ఆయన పలికిన ఈ మాటలు గాంధీజీ స్థాయిని తెలుపగలవు.

ఏడు పాపాల్ని ఆయన నిరసించారు.

**1.** నీతి లేని వ్యాపారం **2.** మనసు లేని ఆనందం **3.** సిద్ధాంతం లేని రాజకీయం **4.** మానవత్వం లేని శాస్త్రవిజ్ఞానం **5.** పని చేయకుండా ధన సంపాదన **6.** త్యాగం లేని పూజలు **7.** శీల నిర్మితి లేని చదువు.


సరళమైన జీవనశైలి ఉన్నతమైన ఆలోచన విధానం ప్రతి వ్యక్తికి ఆభరణం కావాలంటారు బాపూజీ. ఏ దేశవాసికైనా, ఏ కాలంలోనైనా మనిషికి "మూడు కోతులు" ఆదర్శంగా నిలవాలన్నది ఆయన ఆకాంక్ష. *Might is right* అనే ప్రాచీనోక్తిని ఆయన తిరగరాశారు. *Right is might !* అని.

సత్యాహింసలు పర్వతాలంత ప్రాచీనమైనవని చాటిచెప్పి నిరూపించిన జీవితం... గాంధీజీయే పేర్కొన్నట్లుగా "మానవ జాతికి మహత్తర సందేశం"

## మంచి మాట

మనం చేసే పని కష్టం, ఎదుటివారు చేసేది తేలిక అనుకోవడం సరికాదు. ప్రతి పనిలోనూ కష్టం ఉంటుంది. ఏకాగ్రతతో కష్టపడి పని చేస్తే నైపుణ్యం వస్తుంది. అప్పుడు ఏ పనైనా తేలికగా అనిపిస్తుంది.

- లాల్ బహదూర్ శాస్త్రి




# ఎథిక్స్ - అరిస్టాటిల్

## పుస్తకం



ప్రఖ్యాత గ్రీక్ దార్శనికుడు అరిస్టాటిల్ రచన ఎథిక్స్. జీవన ధ్యేయం ఏమిటి? మంచి చెడుల మధ్య విభజన రేఖ ఎక్కడ? ఎలా ఆనందాన్ని పొందాలి! బాధల్ని ఎలా తప్పించుకోవాలి! పదవులు,కీర్తి,ధనం వీటి కోసం పాకులాట ఏమేరకు సమంజసం? ఇలాంటి విషయాలన్నిటినీ వివరంగా చర్చించిన గ్రంథం ఎథిక్స్. బహుశా ఇది మానవ చరిత్రలో తొలి నీతి శాస్త్ర గ్రంథం కావచ్చును. ఈ ప్రపంచంలో వస్తువులు మూడు కోవలకు చెందుతాయి. 1. బాహ్య ప్రపంచానికి చెందినవి 2. మానవ శరీరానికి సంబంధించినవి 3. మనసుకు సంబంధించినవి. ఇవి మూడు వ్యక్తికి అవసరమే. అయితే విజ్ఞుడు మనసుకు సంబంధించిన వస్తువులను ఎక్కువగా కలిగి ఉండి, మిగిలిన వాటిపై తక్కువగా ఆధారపడతాడు. జీవన సౌఖ్యం కోసం చేసే ప్రయత్నాల్ని మనస్సుకు సంబంధించిన వాటితో ముడి పెట్టుకోగలగాలి. భౌతికపరమైన జయాపజయాలకు అతీతంగా స్థిరమైన ఆనందాన్ని సాధించుకోవాలంటే శీలసంపద చాలా అవసరం.శీల సంపద ప్రకృతి సహజంగా పట్టుపడేది కాదు. స్వయం శిక్షణ ద్వారా దాన్ని సొంతం చేసుకోవాలి. శీలం అనేది మనసుకు సంబంధించినది. ఆనందం కూడా మనసుకు సంబంధించినది.





శీలసంపద రెండు కోవలకు చెంది ఉంటుంది.

1. మేధస్సుకు సంబంధించింది. విజ్ఞానం, గ్రహణశక్తి, సందర్భోచిత నిర్ణయం ఇవి ఈ కోవకు చెందుతాయి.
2. నైతికపరమైనవి - మితత్వం, నిగ్రహం. అతివల్లా, అల్ప గుణాల వల్ల సద్గుణ సంపద నాశనమైపోతుంది.అతిగా భోంచేసినా, ఆకలి తీరకుండా భోంచేసినా ఆరోగ్యానికి ప్రమాదకరమే. మనసుకు సంబంధించిన విషయాలకు కూడా ఇది వర్తిస్తుంది. మానవుడిలో చెలరేగే భావావేశాన్నీ, చేసే పనుల్నీ అంటిపెట్టుకుని సుఖదుఃఖాలు ఉంటాయి. ఉద్దేశపూర్వకమైన పనులు మంచి చెడ్డలను బట్టి, స్తుతించటానికి... నిందించటానికి కారణమవుతాయి. ఉద్దేశ రహితమైన పనులు జాలికి, క్షమాపణకు పాత్రమౌతాయి. నిగ్రహాన్ని పాటిస్తూ మితంగా ఆనందాన్ని అనుభవించేవాడు నిజంగా శీల సంపన్నుడు. మంచి - చెడు, దుర్గుణాలు - సద్గుణాలు, భోగలాలసత - నిగ్రహము వీటికి సంబంధించిన విషయాలను ప్రస్తావన చేస్తూ... మానవుడు తన ప్రవర్తనను తీర్చిదిద్దుకోవడానికి కొన్ని విలువైన సూత్రాలను అందించిన అరిస్టాటిల్ గ్రంథం ఎథిక్స్. ఈనాటికే కాదు ఏనాటికైనా ఆ సూత్రాలు విలువైనవే. ఆచరణీయమైనవే. తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాలలో ఇదొకటి.

- డా.నారాయణ నక్కిన

ఓ మహాత్మా!ఓ మహర్షీ!
ఓ క్షమా పీయూష వర్షీ!
ఓ తపస్వీ!ఓ యశశ్వీ!
ఓ అహింసాశయ మనస్వీ!!


- శ్రీ శ్రీ





### లాల్ బహదూర్ శాస్త్రి జయంతి
### అక్టోబర్ 2


"ఏష దేవో విశ్వకర్మా మహాత్మా
సదా జనానాం హృదయే సన్నివిష్టః"

జన హృదయాల్లో నివసించే
దైవమే మహాత్ములంటే!



# పర్యాటక రంగం సమస్యలను అధిగమించాలి





**30.09.21 (మీడియాసెల్)** పర్యాటక రంగంపై కోవిడ్-19 ప్రభావం అధికంగా ఉందని దానిని అధిగమించే మార్గాలను నిపుణులు అన్వేషించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని నేషనల్ వెబినార్‌ను నిర్వహించారు. "కోవిడ్ -19 తర్వాత పర్యాటక పరిశ్రమ సమస్యలు మరియు సవాళ్లు" అనే అంశంపై జరిగిన ఈ వెబనార్ కు ఆచార్య ఎస్.టేకి అధ్యక్షత వహించగా, డా.పి. ఉమామహేశ్వరి దేవి, డా.ఎన్. ఉదయ భాస్కర్ కన్వీనర్లుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ కోవిడ్19 ఆంక్షల కారణంగా వినోద పరిశ్రమలైన సినిమా థియేటర్లు, థీమ్ పార్కులు, పార్టీ క్లబ్‌లు, ఫంక్షన్ హాళ్లు మరియు హెూటల్స్, ట్రావెలింగ్, ఫిట్‌నెస్ కేంద్రాలు మొదలైన అనుబంధ వ్యాపారాలతో పాటు పర్యాటక మరియు ఆతిథ్య పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పర్యాటక రంగాన్ని మళ్లీ పునరుద్ధరించే విధంగా మేధావులు, నిపుణులు అధ్యయనాలు చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఎన్నో పర్యాటక ప్రాంతాలు భారతదేశంలో ఉన్నాయని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మరింత ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఆయుర్వేదం యునాని సిద్ధా వంటి ఎన్నో వైద్య, శాస్త్రీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలతో భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని దానిని ప్రతిబింబించే విధంగా పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. భారతదేశ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకురావాలన్నారు. తరువాత పర్యాటక నిర్వహణ విభాగం, పాండిచ్చేరి విశ్వవిద్యాలయం ఆచార్యులు వై.వెంకటరావు మాట్లాడుతూ కోవిడ్ -19 మహమ్మారి సంక్షోభంలో పర్యాటక పరిశ్రమలో సాధ్యమయ్యే కొత్త మార్పులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

# నూతన భవన ప్రవేశ మహోత్సవం




**25.09.21 (మీడియాసెల్)** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని YN కళాశాలలో చిరంజీవి ఎంపీ ల్యాడ్స్ నుండి లభించిన నూతన భవన ప్రవేశ మహోత్సవం శనివారం వైభవోపేతంగా నిర్వహింపబడింది. విశాలమైన ఈ భవంతిగదుల్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (రాజమండ్రి) ఉపకులపతి మాన్యశ్రీ మొక్కా జగన్నాథరావు గారు భవన ప్రవేశమహోత్సవం ముఖ్యఅతిథిగా నిర్వహించారు. కళాశాలలోని వివిధవిభాగాల కార్యకలాపాలను సమీక్షిస్తూ ఉపకులపతి జగన్నాథరావు చక్కని నిర్మాణాత్మకమైన సలహాల నివ్వటం అందరికీ ఆనందం కల్గించింది. కళాశాలలో ప్రత్యేక ఆకర్షణయైన గాంధీస్టడీసెంటర్ లో గాంధీజీ విగ్రహాన్ని కూడా ఉపకులపతి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి కళాశాల కోశాధికారి పొన్నపల్లి శ్రీరామారావు తమ అధ్యక్షోపన్యాసంలో ఉపకులపతి విశేషకృషిని ప్రతిభని ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేంకటరత్నం, PG డైరక్టర్ చింతారావు తమతమ విభాగాల నివేదికల్ని సమర్పించారు. కళాశాల కార్యదర్శి డా. చినమిల్లిసత్యనారాయణరావు కళాశాల స్థితిగతుల్ని వివరించి, విద్యావేత్తయైన జగన్నాథరావు ఉపకుల పతి కావటం ముదావహం అన్నారు. కళాశాలలో జరుగుతున్న కార్యక్రమాలు ఏవిధంగా విద్యార్థులు ఉపయోగించుకుంటున్నారో తెలియజేశారు. ఉపకులపతి రాకకితమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. నాటి ముఖ్య అతిథి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రసంగవాణి స్ఫూర్తిదాయకంగా ఉండి శ్రోతలందరిని అలరించింది. కళాశాల విద్యావిధానంలో పరిశోధనకి ప్రాధాన్యం, నూతన కోర్సుల ప్రారంభావశ్యకత, అధ్యాపకుల బాధ్యత, విద్యార్థులను ఉత్తేజపరిచే బోధనాపటిమలను గూర్చి వివరిస్తూ గురువు నడిచేవిజ్ఞాన సర్వస్వం కావాలన్నారు. గ్రంథాలయం పాత్రని నొక్కివక్కాణించారు. ఆనాటి వారి ప్రసంగం విద్యార్థులకి ప్రచోదన అధ్యాపకులకి ప్రబోధం NAAC గుర్తింపు ప్రాధాన్యం పాలకవర్గానికి సరిక్రొత్త సన్నివేశంలో ఆవశ్యకమైన సలహాలతో అన్ని వర్గాలవారిని ఆకర్షించింది. హితైషులవదాన్యత వలన విద్యారంగానికి జరిగే మంచిని తెలిపిన ఉపకులపతుల ఉపన్యాసం ఆసక్తికరంగా విజ్ఞానదాయకంగా స్ఫూర్తిమంతంగా సాగింది. ఉత్తమ ప్రతిభగల విద్యార్థులకు ఉపకులపతుల చేతులమీదుగా బహుమతులందజేశారు. శ్రోతల హర్షధ్వానాల నడుమ ఉపకులపతి గారిని కళాశాల యాజమాన్యం,అధ్యాపకబృందం, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల అధ్యాపకురాలు శ్రీమతి కవితారాణి వందన సమర్పణతో జాతీయగీతాలాపనతో సభ విజయవంతంగా ముగిసింది. కళాశాల యాజమాన్య సభ్యులు అధ్యాపక-అధ్యాపకేతరబృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సభని జయప్రదం గావించారు. విద్యాలయానికి విద్యావేత్త కావించిన అధికార పర్యటన విద్యావిషయిక ప్రాధాన్యంగా నిర్వహింపబడినదని నాటి విద్యా ప్రముఖుల అభిప్రాయం.








## అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య పి.సురేష్ వర్మ


అకడమిక్ అఫైర్స్ డీన్ గా వర్మకు ఉత్తర్వులు అందిస్తున్న వీసీ

**29.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ గా ఆచార్య పి.సురేష్ వర్మకు భాధ్యతలు అప్పగిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు అందజేశారు. విశ్వవిద్యాలయంలోని ఆయా విభాగాలకు సంబంధించిన బాధ్యతలను అధ్యాపకులకు అప్పగిస్తూ వీసీ బుధవారం ఉత్తర్వులను అందించారు. అలాగే ఉమెన్స్ హాస్టల్ చీఫ్ వార్డ్ గా డా.పి.విజయనిర్మలను, ఫ్యాకల్టీ అసోసియేట్ గా డా.పి.లక్ష్మీనారాయణ ను నియమిస్తూ ఉత్తర్వులను అందించారు. నూతనంగా ఆయా విభాగాలలో బాధ్యతలు చేపడుతున్న ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.విజయ నిర్మల, డా.పి.లక్ష్మీనారాయణలు విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఇప్పటి వరకు అకడమిక్ అఫైర్స్ డీన్ గా బాధ్యతలు నిర్వహించిన ఆచార్య వై.శ్రీనివాసరావు, చీఫ్ వార్డెన్ గా బాధ్యతలను నిర్వహించిన డా.కె.రమణేశ్వరి సేవలు అభినందనీయమన్నారు.


## ఎం.ఎస్.ఎన్ క్యాంపస్‌లో డిపార్ట్మెంట్ లైబ్రరీ


డిపార్ట్మెంట్ లైబ్రరీ లో చదువుకుంటున్న విద్యార్థులు

**29.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ కాకినాడలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ లైబ్రరీకి అవుట్‌గోయింగ్ బ్యాచ్ సీనియర్ విద్యార్థులు పుస్తకాలను బహుకరించారు. దీనిపై ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ డిపార్ట్మెంట్ లైబ్రరీ ద్వారా ఆయా విభాగాల విద్యార్థులకు అవసరమైన విజ్ఞానం, పుస్తక సమాచారం అందుబాటులో ఉంటాయన్నారు. లైబ్రరీతో విభాగాలు విద్యాపరంగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. క్యాంపస్ లోని మిగిలిన విభాగాలు దీనిని స్ఫూర్తిగా తీసుకొని డిపార్ట్మెంట్ లైబ్రరీలను అభివృద్ధి చేయాలని తెలియజేశారు.



# త్రికరణశుద్ధిగా పనిచేయడమే గాంధీయిజం



గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న వీసీ

**29.09.21 (మీడియాసెల్)** త్రికరణశుద్ధిగా ఎవరి పని వారు నిర్వహించడమే ప్రధాన కర్తవ్యమని గాంధీ చెప్పిన మాటలను ఆచరిస్తూ గాంధీ మార్గంలో పయనించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఈసీ హాల్ లో గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి వీసీ, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన పని మనం త్రికరణశుద్ధిగా నిర్వహిస్తూ, పని చేస్తున్న సంస్థను ప్రేమించడం ద్వారా అభివృద్ధి సాధించగలమని, గాంధీ ఆలోచనలు సహకారం చేయగలమని తెలియజేశారు. ఆధునిక మానవుని ఆలోచనలు హింసాత్మకంగా మారుతున్నాయని, శారీరక హింసతో పాటు మానసికంగా హింసిస్తుంటారని తెలిపారు. నిరాడంబర జీవితంతో ఇతరులకు సహకారులుగా, ఇతరులను ప్రేమించేవారిగా ఉండాలన్నారు. అహింసా మార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించిన మహానీయుడు పుట్టిన నేలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. ఒత్తిడి లేని జీవన విధానాన్ని అలవరచుకుంటూ శాంతియుతమైన జీవితాన్ని గడపాలని చెప్పారు. గాంధీజీ నిరాడరంబరంగా జీవిస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. సత్యం, అహింస, ప్రేమ, శాంతి వంటి అలవాట్లను కలిగి గాంధీజీ మార్గంలో పయనించాలని సూచించారు. గాంధీజీ ఆలోచనలు ఆశయాలను ఆచరణాత్మకంగా పాటించటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఆచార్య ఎస్ టేకి, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.కె.రమణేశ్వరి, డా.కె.వి.స్వామి, డా.పి. విజయ నిర్మల, డా.బి.కెజియారాణి, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎన్. ఉదయ భాస్కర్, డా.ఎం.గోపాలకృష్ణ, డా.రామ్ గోపాల్, జయంతి హరిణి తదితరులు పాల్గొన్నారు.



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్.క్యాంపస్ కాకినాడలో గాంధీజీ 152వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ

**29.09.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. బుధవారం వీసీ కార్యాలయంలో ఆయన ఫలితాలు విడుదల చేసి వివరాలను తెలియజేశారు. ఉభయగోదావరి జిల్లాల్లోని డిగ్రీ మూడవ సెమిస్టర్ బిఏ, బికామ్, బిబిఏ, బిఎస్సీ, బిసిఏ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొత్తం 29437 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాశారని వారిలో 18706 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 63.55 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. కొవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డా.బి.విజయకుమారి పాల్గొన్నారు.



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ



## సుప్త చేతన

బాధ మంచు పర్వతం...
కదిలించిన ప్రతిసారి కరుగుతూనే ఉంది
గుండెల్లో కరుగుతూ కళ్ళలో నుండి జారే బాధ...
ఎన్ని Fathoms లోతుకి ఈ బాధ వ్యాపించిందో!!
భావాల లోతునీ, బాధల బరువునీ
కొలిచే సాధనం ఏది??
ఎవరైనా వచ్చి ఉఫ్ అని గుండెలోని
బాధని ఊదేస్తే బాగుండు అనిపిస్తుంది..
కలలు ఎక్కడ ఆగిపోయాయో
అక్కడి నుండి మజిలీ మొదలైతే బాగుండేది!!
కాలపు గోడల బీటల మధ్య
ఇరుక్కుపోయిన నా కలల పేజీలు
అగాధపు అడుగు నుండి ఎగిరి వస్తే బాగుండేది!!
శూన్యంలో చిక్కుబడిపోయిన
ఆ పేజీల మీద రాసుకున్న
కలల కావ్యాలు చెరిగిపోయాయేమో!?
అసంపూర్ణ స్థితిలో కర్కశమైన
కాళ్ళ కింద పడి చిదిమివేయబడ్డాయేమో??
Infect అయిన కలకి treatment ఇచ్చేదెవరు?
ఎన్ని అనుభూతుల ఎరువుని వేస్తే
మళ్ళీ ఒక కల ఎదుగుతుంది??
ప్రాణం పుట్టుకకూ, పోకడకూ చాలు ఒక క్షణం..
గాయం గానమై సాగుతూ...
కాలం వాయులీనమై ...
అనుమానాల వైతరణిని ఆవిరి చేసినప్పుడు...
శిథిలమైన జ్ఞాపకాల లోతుల్లోంచి..
మొలకెత్తిన కొత్త అనుభూతుల ప్రవాహాలు..
దాహంతో అలసిపోయిన గుండె గొంతుని
తడుపుతూ నీలోనికి, నాలోనికి...
విశ్వమానవాళి సుప్తచేతనలోనికి ఒదిగిపోయాయి..
'పుట్టుటయు నిజము
పోవుటయు నిజము
నట్టనడిమి కథ నాటకము'
అంటారు అన్నమయ్య...
కష్టాన్ని ఒక పీడకల అనుకుంటే...
దాన్ని దాటే సమయం కేవలం ఒక రాత్రి మాత్రమే!!
ఓపికతో ఇంకొక్క రాత్రి ఎదురుచూస్తే...
దానికి దొరికే ప్రతిఫలం..
అనంత విశ్వాన్ని మేలుకొలిపే
ప్రకాశమానమైన సూర్యోదయం...
బాధ చాటున దాక్కుని చూడాల్సిన రోజులు
త్వరలోనే పోతాయి!! Time Heals Everything...

– చంద్రిక గూడపాటి

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in